# వృద్ధులు, మహిళలపై దాడులు చేస్తే కఠిన చర్యలు



**మన తెలంగాణ/సిటీబ్యూరో:** వృద్ధులు, మహిళలపై దాడులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాచకొండ పోలీస్ కమిషనర్ డిఎస్ చౌహాన్ హెచ్చరించారు. తెలంగాణ సీనియర్ సిటిజన్స్ సంఘం శనివారం నిర్వహించిన సదస్సులో సిపి డిఎస్ చౌహాన్ పాల్గొన్నారు. ఎన్నో ఏళ్ల బాధ్యతగా విభిన్న రంగాల్లో సేవలందించి, దేశ అభ్యున్నతికి కారణమైన వృద్ధుల పట్ల అందరూ గౌరవంగా ఉండాలని సూచించారు. తమ శ్రమతో ఎన్నో కష్టనష్టాలు భరిస్తూ పెంచిపెద్ద చేసిన తల్లిదండ్రుల పట్ల పిల్లలు ప్రేమగా బాధ్యతతో ఉండాలని తెలిపారు. సమాజంలో వృద్ధాశ్రమాలు అవసరం రాకూడదని అన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వయోవృద్ధులు, మహిళల భద్రత కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి న్యాయం జరిగేలా చేస్తున్నామని తెలిపారు. పిల్లల చేతిలో హింస, నిరాదరణకు గురవుతున్న వృద్ధులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని, బాధితులు రాచకొండ వాట్సాప్ కంట్రోల్ రూమ్ 9490617111కు ఫిర్యాదు చేయాలని కోరారు. పోలీసులు వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటారని తెలిపారు. సమావేశంలో డిసిపి మధుకర్ స్వామి, తెలంగాణ సీనియర్ సిటిజన్స్ సంఘం సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# వయో వృద్ధులు ప్రపంచ సంపద : సీపీ చౌహాన్



**మాట్లాడుతున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్**

**ఉప్పల్:** వయోవృద్ధులు పిల్లలకు ప్రపంచ జ్ఞానాన్ని ప్రసాదించే వారధులని, వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదేఅని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అన్నారు. శనివారం ఉప్పల్ మేకల భారతి గార్డెన్‌లో నిర్వహించిన 'సీనియర్ సిటిజన్స్, తల్లిదండ్రుల సంరక్షణ 2007 చట్టంపై' నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వృద్ధులను ఇబ్బంది పెడితే చర్యలుతీసుకుంటామన్నారు. సీనియర్ సిటిజన్ ఆధ్యక్షుడు నర్సింహా రావు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లు తమ హక్కులను పొందడంలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జస్టిస్ చంద్ర కుమార్, సంఘం కార్యదర్శి ఆర్ . నర్సయ్య పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్స్‌ను గౌరవించాలి..

## రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

ఉప్పల్, ఏప్రిల్ 1: సీనియర్ సిటిజన్స్‌ను గౌరవించడం బాధ్యతగా గుర్తించాలని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అన్నారు. శనివారం ఉప్పల్‌లోని మేకల భారతి గార్డెన్‌లో రాచకొండ పోలీస్‌శాఖ, తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్, తల్లిదండ్రుల సంరక్షణ 2007 చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పోషణ, రక్షణ, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్ సంరక్షణ కోసం చట్టాలు ఉన్నాయని, వాటిని ఉల్లఘించేవారిపై చర్యలు తప్పవన్నారు. తల్లిదండ్రులతో మనం ప్రవర్తించే తీరును మన పిల్లలు గమనిస్తుంటారని అన్నారు. సమాజానికి ఆదర్శంగా ఉండేలా వ్యవహరించాలని సీపీ సూచించారు.




సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్